క్లుప్తంగా

సత్తెమ్మతల్లి గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న ఏవీ సత్యనారాయణ

మునగపాక: చెరువు కాలువ సంఘం ఆధ్వర్యంలో సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం మునగపాకకు చెందిన ఏవీ సత్యనారాయణ తనవంతు సాయంగా రూ.5 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దాడి చంద్రరావు, వెలగా అప్పలనాయుడు, సంఘ పెద్దలు బొడ్డేడ రాము నాయుడు, ఆడారి జగ్గారావు, దాడి సూరప్పారావు, బొడ్డేడ అప్పలనాయుడు, వెలగా ధర్మసూరి, వెలగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

అచ్యుతాపురం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం అచ్యుతాపురంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికుల్ని మోసం చేస్తుందన్నారు. కార్మికులు పోరాడితే తప్ప సంక్షేమ బోర్డుని కాపాడుకోలేని దయనీయ స్థితి ఏర్పడిందన్నారు. రాజన్న, అప్పలనాయుడు, కె.రాజు, ఎల్.శ్రీను, పైడిరాజు, నాగేశ్వరరావు, వసంత చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక గ్రామాభివృద్ధికి కృషి




మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామానికి అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలన్నారు. రహదారులు, డ్రైన్లు, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్యం, తాగునీటి విషయంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు పెంటకోట సత్యనారాయణ, బొడ్డేడ సోమరాజు, పెద్దలు టెక్కలి పరశురామ్, శరగడం పరదేశినాయుడు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

యలమంచిలి రూరల్: మండలంలో కృష్ణాపురం శివారు ప్రాంతంలో కోడి పందేల శిబిరంపై యలమంచిలి రూరల్ పోలీసులు గురువారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇక్కడ డబ్బులు పణంగా పెట్టి కోడి పందేలు ఆడుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లగా నలుగురు నిందితులు కోడి పందేలు ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.720, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కే సావిత్రి తెలిపారు. కోడి పందేలు, జూద క్రీడలు వంటివి నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

మునగపాక: మహిళలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ హెచ్చరించారు. మండలంలోని తిమ్మరాజుపేటలో గురువారం రాత్రి సైబర్ మోసాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లోని అమాయకులను లక్ష్యంగా చేసుకొని కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారన్నారు. బ్యాంక్‌ల నుంచి ఫోన్ చేస్తూ ఓటీపీ చెప్పాలంటూ కొత్త మోసాలకు పాల్పడేవారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐ పి.ప్రసాదరావు పాల్గొన్నారు.

గాంధీ జయంతి నాడు మాంసం విక్రయాలు

- అధికారుల నోటీసులు బేఖాతర్

యలమంచిలి రూరల్: అధికారుల నోటీసులను బేఖాతరు చేస్తూ గాంధీ జయంతి నాడు గురువారం పట్టణంలో కొంతమంది మాంసం విక్రయాలు బహిరంగంగానే చేశారు. దసరా సెలవు కావడంతో మున్సిపల్ అధికారులెవరూ అందుబాటులో లేరు. డాబా హోటళ్లు, రెస్టారెంట్లు, భోజన హోటళ్లలో చికెన్, మటన్ బిర్యానీలు, ఇతర వంటకాలు యథేచ్ఛగా విక్రయించడం గమనార్హం. మరోవైపు మద్యం షాపులు, బార్లు మూసివేసినప్పటికీ బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయించారు. జాతిపిత జయంతి రోజున మాంసం, మద్యం విక్రయాలను ప్రభుత్వాలు నిషేధించాయి. ఆ ఒక్క రోజూ ఇటు వ్యాపారులు, అటు ప్రజలు సంయమనం పాటించకపోవడం దురదృష్టకరం.

‘భయో’వ్యర్థాలు

- మున్సిపల్ చెత్తలో పడేస్తున్న ఆస్పత్రులు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- కానరాని కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం
- పట్టించుకోని అధికారులు



యలమంచిలి సీహెచ్‌సీలో వ్యర్థాల కోసం నాలుగు డబ్బాలకు బదులుగా పసుపురంగు డబ్బా



యలమంచిలి బస్టాండు సమీపంలో అనుమతిలేని ప్రైవేటు ఆస్పత్రి వద్ద చెత్తతో కాలుస్తున్న వైద్య వ్యర్థాలు



యలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డులో సాధారణ చెత్తలో వేసిన ఆస్పత్రి వ్యర్థాలు

యలమంచిలి రూరల్: హాని కలిగించే బయో మెడికల్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడే వేస్తున్నారు. వీటి ద్వారా అనేక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఇలాంటి వ్యర్థాలను తరలించడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓ ప్రైవేటు సంస్థ టెండర్ దక్కించుకుంది. ఇన్సులేటర్ వాహనాలతో బయో మెడికల్ వ్యర్థాలను తీసుకెళ్లి వివిధ పద్ధతుల్లో ధ్వంసం చేస్తారు. ఈ విషయంలో యలమంచిలి పట్టణంలో ప్రభుత్వ, ప్రవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నాయి.

ఉల్లంఘన ఇలా..

పట్టణంలో 25 వరకు పెద్ద, చిన్న ఆస్పత్రులు, ప్రాథమిక చికిత్స కేంద్రాలు, 10 వరకు ల్యాబ్‌లు ఉన్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలు, పీఎంపీల ప్రథమ చికిత్సా కేంద్రాలతోపాటు కొన్ని అనుమతిలేనివి, మరికొన్ని అర్హతలేనివి ఆస్పత్రులున్నాయి. వీటికి బయో వ్యర్థాల నిర్మూలన కేంద్రం నుంచి అనుమతులు లేకపోవడంతో వాటి నుంచి సేకరణ జరగడం లేదు. ఫలితంగా వీరంతా మున్సిపాలిటీ, పంచాయతీ చెత్తలో బయో మెడికల్ వ్యర్థాలను వేసి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. కొందరైతే ఏకంగా తమ ఆస్పత్రుల ముందున్న సాధారణ చెత్తలో వీటిని వేసి, బహిరంగంగా ఆ వ్యర్థాలను కాల్చివేస్తున్నారు.

నిబంధనలివీ...

- నిబంధనల ప్రకారం బయో మెడికల్ వ్యర్థాలను ఆస్పత్రుల్లో పసుపు, ఎరుపు, తెలుపు, బ్లూ రంగుల చెత్త డబ్బాలు ఉండాలి. కానీ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మెడికల్ వ్యర్థాలు వేర్వేరుగా ఉంచేందుకు నాలుగు రంగుల డబ్బాలు ఎక్కడా కన్పించవు.
- ఆస్పత్రుల్లో వ్యర్థాల కోడింగ్ ప్రకారం నిర్దేశించిన వ్యర్థాలను నాలుగు రంగుల డబ్బాలు లేదా బ్యాగుల్లో ఆస్పత్రి సిబ్బంది వేయాల్సి ఉంటుంది. పసుపు రంగు డబ్బాలో మానవ శరీర సంబంధమైన వ్యర్థాలు, జంతు శరీర సంబంధమైన వ్యర్థాలు, మాయ, కలుషిత దూది, డ్రెస్సింగ్ క్లాత్, విషపూరిత వ్యర్థాలు, గడువు ముగిసిన మందులు, మాస్కులు వేయాలి. వీటిని 1200 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద నిర్వీర్యం చేస్తారు.
- ఎరుపు రంగు డబ్బాల్లో సిరంజీలు, ఐవీ సెట్‌లు, కాథెరెల్, గ్లౌజులు, బ్లడ్ బ్యాగ్స్, యూరిన్ బ్యాగ్స్, డయాలసిస్ కిట్, వీ బాటిల్స్ వేసేలా ఏర్పాట్లు చేయాలి.
- తెలుపు రంగు డబ్బాల్లో సూదులు, స్థిర సూదులు, సిరంజిలు, బ్లేడ్లు, శస్త్ర చికిత్స బ్లేడ్లు వేస్తారు. బ్లూ డబ్బాల్లో గాజుతో చేసిన జంజెక్షన్ బాటిల్స్, ల్యాబ్ స్లైడ్స్, ఇంప్లాంట్స్, కత్తెరలు వేయాలి.
- సాధారణ చెత్తలో ఆస్పత్రి వ్యర్థాలు పడేయడం, ఇష్టానుసారం కాల్చడం వలన అంటువ్యాధుల వ్యాప్తికి దారితీసే ప్రమాదముంది.
- వ్యర్థాల సేకరణ డబ్బాలకు తప్పనిసరిగా మూతలు ఉండాలి. లేదంటే అక్కడ పనిచేసే నర్సులు, సిబ్బంది, దుస్తులు శుభ్రం చేసే వారు, పారిశుధ్య కార్మికులు రోగాల బారిన పడతారు.

ఆస్పత్రుల నిర్లక్ష్యం

యలమంచిలి పట్టణం, మండలంలోని గ్రామాల్లో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. యలమంచిలి సీహెచ్‌సీలో వ్యర్థాలను ఒప్పంద సంస్థ రోజూ తీసుకెళ్లడం లేదు. మూడు లేదా వారానికొకసారి ఇన్సులేటర్ వాహనం వస్తోంది. యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో వ్యర్థాలు ఉంచేందుకు నాలుగు రంగుల చెత్త డబ్బాలే కనిపించడంలేదు. అక్కడ ఒకటి రెండు రంగుల డబ్బాలు మాత్రమే కనిపిస్తున్నాయి. వాటిలో ఎప్పుడూ మెడికల్ వ్యర్థాలు ఉండడం లేదు. మున్సిపాలిటీ చెత్త బండిలో వేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. భవనం వీధిలో ఆస్పత్రుల యాజమాన్యాలు వ్యర్థాల సేకరణ సంస్థతో ఒప్పందాలే కుదుర్చుకోలేదని సమాచారం. రేగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర, యూపీహెచ్‌సీ, ఉప కేంద్రాల్లో వైద్య వ్యర్థాల నిర్వహణ సక్రమంగా నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. యలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డులో అనుమతిలేని ఒక పిల్లల ఆస్పత్రిలో వైద్య వ్యర్థాలను పక్కనే మున్సిపాలిటీ సాధారణ చెత్తలో వేస్తున్నారు. అప్పుడప్పుడు వైద్య వ్యర్థాలను రోడ్డుపైనే కాల్చుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. పట్టణంలోని ల్యాబ్‌ల్లో పరీక్షలకు ఉపయోగించే వైద్య వ్యర్థాల్లో ఎక్కువ శాతం మున్సిపల్ చెత్తతో చేరుతుండగా, కొందరు ఆస్పత్రుల నిర్వాహకులు తమ ఆవరణలోనే సిబ్బందితో వ్యర్థాలను కాల్చివేయిస్తున్నారు. ఆస్పత్రులు, ల్యాబ్‌ల్లో వైద్య వ్యర్థాల నిర్వహణపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య వ్యర్థాల నిర్వహణ పక్కాగా ఉండాలి



యలమంచిలి పట్టణ పరిధిలో ప్రైవేటు ఆస్పత్రుల్లో జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం పక్కాగా ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. జీవ వైద్య వ్యర్థాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవాలి. ప్రజారోగ్యానికి హాని కలిగినట్టు ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు.

– బీజేఎస్ ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

గెస్ట్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం లాలం కోడూరు గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఇంగ్లిషు అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిషు సబ్జెక్టులో 50 శాతం ఉత్తీర్ణతతో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 13వ తేదీన సదరు పోస్టుకు గానూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్ఈసీ మెంబర్లుగా చెంగల, బోదెపు



బోదెపు గోవింద్



చెంగల వెంకట్రావ్

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చెంగల వెంకట్రావ్ (పాయకరావుపేట), బోదెపు గోవింద్‌రావు (యలమంచిలి)లను పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ తీగ తగిలి పాడి గేదె మృతి

పరవాడ: మండలంలోని రావాడలో మోటూరు రమణకు చెందిన పాడి గేదె విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది. గ్రామ పొలిమేరలో శుక్రవారం ఉదయం మేత మేస్తుండగా వేలాడుతున్న విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

భిక్షాటనతో మత్స్యకారుల నిరసన



మత్స్యకారుల దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెంగల

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయడం వల్ల ఉపాధి కోల్పోతామని మత్స్యకారులు భిక్షాటన ద్వారా వినూత్నంగా నిరసన చేపట్టారు. వీరు చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారానికి 20వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బి.బాజ్జి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు పీక్కి తాతీలు, స్వామి, నాగేష్, సోమేష్ మాట్లాడుతూ రాజయ్యపేట గ్రామానికి ఆనుకుని 2007లో ప్రారంభించిన హెటిరో డ్రగ్స్ కంపెనీ నుంచి వెలువడిన రసాయన వ్యర్థాలు వల్ల చేపలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ సాగరంలో కలిసే వ్యర్థాలు వల్ల చేపల వేట కష్టతరంగా ఉందని, దీని వల్ల గ్రామాలు ఖాళీ అవుతున్నట్లు వాపోయారు. వాయు, జల కాలుష్యాలతో క్యాన్సర్, ఊపిరితిత్తులు సమస్యలు వస్తున్నాయని వ్యాధులు బారినపడి అనేక మంది మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలైనా వదులుకుంటాం తప్ప ఇటువంటి కంపెనీలు రాకుండా పోరాటాలు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు మాట్లాడుతూ రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయవద్దని, సెప్టెంబర్ 14 తేదీ నుంచి నిరాహార దీక్షలు చేస్తున్నారన్నారు. గంగపుత్రులు అభిప్రాయం మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో వారికి అండగా ఉంటామని తెలిపారు. జెడ్పీటీసీ కాసులమ్మ, గంగపుత్రులు నాయకులు స్వామి, సోములు, సూరిబాబు, తాతారావు పాల్గొన్నారు.

12న ఛత్రపతి శివాజీ నాటిక ప్రదర్శన



నాటిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ రాము

మునగపాక: గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మునగపాకలో ఈ నెల 12న జయహో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము తెలిపారు. ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్, మునగపాక అభివృద్ధి ప్రదాత పెంటకోట జనరాజ్‌దాస్ 67వ జయంతిలో భాగంగా ఈ నాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించేందుకు డాక్టర్ రామన్ ఫౌండేషన్ విజయవాడకు చెందిన సీబీఆర్ అకాడమి ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ నిర్వహణలో 12వ తేదీన రాత్రి 7 గంటలకు చారిత్రాత్మక నాటిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే రోజు సినీ దర్శకుడు ఎల్.సత్యానంద్‌కు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామీణ యువజన మందిర అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్, పూర్వ అధ్యక్షుడు ఆడారి గంగమహా కళాకారులు దాడి ముసిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట వెంకట్, పెంటకోట విజయ్, టెక్కలి కొండలరావు, ఎంఎం నాయుడు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి గణేష్, మళ్ల రామజోగినాయుడు, భరణి, సూరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.


రైతులకు జీఎస్టీపై అవగాహన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జీఎస్టీ డిప్యూటీ అడిషనల్ కమిషనర్ ప్రతిభాదేవి

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన జీఎస్టీ ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని జీఎస్టీ డిప్యూటీ అడిషనల్ కమిషనర్ డి.ప్రతిభాదేవి తెలిపారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం జీఎస్టీపై రైతులకు అవగాహనతోపాటు ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి వివిధ పరికరాలకు జీఎస్టీ ద్వారా కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాలన్నారు. రైతులకు అవసరమయ్యే పరికరాలను తక్కువ ధరలకు అందుతాయన్నారు. సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, ఉప సర్పంచ్ మొల్లేటి దేవీ, ఏఈవోలు లక్ష్మి, పద్మిని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



మోసా శ్రీనును పరామర్శిస్తున్న నాయకులు

పాయకరావుపేట: మండలంలో కొర్లయ్యపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మోసా శ్రీనును పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు పరామర్శించారు. మోసా శ్రీను ఇటీవల ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాల్మన్‌పేట, పెంటకోట సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, చేపల నాగమణి తాతాజీ, నాయకులు బొడ్డు హరిబాబు, మైలపల్లి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

56 మంది రక్తదానం



రక్త దానం చేస్తున్న యువకులు

అచ్యుతాపురం: మండలంలోని పూడి ఆర్అండ్ఆర్ కాలనీ వైఎస్సార్ నగర్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 56 మంది రక్తదానం చేశారు. రాజాన సంజీవి మిత్ర మండలి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని ఈ శిబిరం ఏర్పాటు చేశారు. లాలం నరేంద్ర, మాసవరపు కాసుబాబు, పవన్, హేమంత్ కుమార్, ధన పాల్గొన్నారు.

జీఎస్టీతో సూపర్ సేవింగ్స్

పాయకరావుపేట: మండలంలో శ్రీరాంపురంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ 2.0పై మండల స్థాయి అవగాహనా సదస్సు ఏవో ఆదినారాయణ నిర్వహించారు. జీఎస్టీ ఉప అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ నూతన జీఎస్టీతో వ్యవసాయ పనిముట్లు, డ్రిప్ యంత్రాలు, స్ప్రింకర్లు, ట్రాక్టర్లు, టైర్లు, స్ప్రేయర్స్, రేట్లు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చింతలపు ప్రదీప్, శ్రీరాంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు చిక్కాల శ్రీనివాస్, శ్రీరాంపురం పశు వైద్యాశాఖ అధికారి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గాంధీ సూత్రాలు అనుసరణీయం



అచ్యుతాపురం ప్రభుత్వ కార్యాలయాల వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం: గాంధీ సూత్రాలను అందరూ అనుసరించాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కోరారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆ మహనీయుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



దివ్యాంగుల ఆశ్రమంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం మండలంలోని దివ్యాంగుల ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో రాష్ట్ర రోడ్డు రవాణా, భవనాల అభివృద్ధి మండలి చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్నాయక్, చొప్పా తాతారావు, గుర్రం గోవింద్, పుర్రె గోపీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ రోడ్డులో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైస్ చైర్మన్ అర్రెపు సత్య గుప్తా, బండారు సత్య బంగారుశెట్టి

యలమంచిలి రూరల్: గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం యలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డులో మహాత్ముడి విగ్రహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు సత్య గుప్తా పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్, ఇతర కార్యాలయాల్లో గాంధీ జయంతి కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. ఉప కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. బండారు సత్య బంగారుశెట్టి, ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు.

శ్రీవరి చిట్టమ్మకు ప్రత్యేక పూజలు



శ్రీవరి చిట్టమ్మను దర్శించుకున్న నాయకులు

పాయకరావుపేట: మండలంలో గజపతినగరంలో నూతనంగా నిర్మించిన శ్రీవరి చిట్టమ్మను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు దర్శించుకున్నారు. అమ్మవారి నూతన దేవస్థానం నిర్మాణ సందర్భంగా దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యజ్జల సత్యనారాయణ, రాజవరం సర్పంచ్ గోసల అమ్మాజీ, చేపల నాగమణి తాతాజీ, కాకాడ కృష్ణ, చోడిపల్లి అన్నవరం, గోసల నూకరాజు, వంకా రమణ పాల్గొన్నారు.


మధువర్మకు ఘన సత్కారం



మధువర్మను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం: గుర్రాజుపేట గ్రామానికి చెందిన మధువర్మను శుక్రవారం పార్టీ గ్రామ నాయకులు ఘనంగా సత్కరించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా మధువర్మ నియమితులు కావడం ఆనందంగా ఉందని గుర్రాజుపేట గ్రామ శాఖ కన్వీనర్ దాట్ల రామరాజు తెలిపారు. పార్టీలో కొత్త ఉత్సాహం వచ్చిందని అభిప్రాయపడ్డారు. నాయకులు కొలుకులూరి వెంకటపతిరాజు, కొర్ని సూరిబాబు, కొంపు అప్పలాజు, కుందేటి గోవిందు, పులిగా రమణ తదితరులు పాల్గొన్నారు.

నూతన జీఎస్టీతో నగదు ఆదా



జీఎస్టీ తగ్గింపు కరపత్రాలతో మానవహారం చేస్తున్న దృశ్యం

మునగపాక: నూతన జీఎస్టీ అమలులోకి రావడం ద్వారా నగదు ఆదా అవుతుందని మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ లక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమీపంలో నూతన జీఎస్టీకి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన నూతన జీఎస్టీ ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. వెలుగు ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు సీసీలు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మునగపాక: బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్రస్థాయి కార్యకర్త కేఎల్‌వీ రమ్య కోరారు. టి.సిరసపల్లి, ఒంపోలు గ్రామాల్లో శుక్రవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల రక్షణ, సంక్షేమ కమిటీ సభ్యుల ఎంపిక నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సర్పంచ్‌లు మద్దాల ధనలక్ష్మి, సూరిబాబు, పంచాయతీ కార్యదర్శులు ఎస్తేర్, హరనాథ్, ఏఎన్ఎంలు శోభారాణి, జయమ్మ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: యలమంచిలి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కే రాజశేఖర్ తెలిపారు. 33/11కేవీ పురుషోత్తపురం ఉపకేంద్రం, రాంబిల్లి 11 కేవీ ఉప కేంద్రం పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

పాయకరావుపేట: 132 కేవీ సబ్ స్టేషన్‌లో 33 కేవీ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. 33/11 కేవీ సత్యవరం, 33/11 కేవీ శ్రీరాంపురం సబ్ స్టేషన్ల పరిధిలో గ్రామాలకు ఈ అసౌకర్యం ఉంటుందన్నారు. ఉదయం 4 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఎస్.రాయవరం: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.